# శిల్పి-శిల్పం

## దేవరపల్లి సూర్యవెంకట సత్యనారాయణమూర్తి

(క్రిందటి సంచిక తరువాయి)

### జరిగిన కథ

గుమాస్తా రమణరావు కూతురు జ్యోతి బి.ఎస్‌సి. చదువుతూ శ్రీధర్ అనే లెక్చరర్‌ని ప్రేమించింది. కట్నం పదివేలు ... కానీ రమణరావుదగ్గిర అయిదు వేలు మాత్రం ఉన్నాయి. మిగత అయిదువేలు తను పెంచి పెద్దచేసిన తమ్ముడు సూర్యనాథ్ కలెక్టరుగదా, యివ్వకపోతాడా అని అడగడానికి వచ్చాడు. సూర్యనాథ్ కలెక్టరైనా భార్యకు బెదిరే మనిషి. మనసులో సహాయం చేయాలని ఉన్నా, భార్యకు దడిసిన తమ్ముడు, కాదన్న తర్వాత దిక్కుచచ్చి రైలెక్కాడు రమణరావు.

---

రమణారావు భార్యతోను, జ్యోతితోను జరిగిందంతా చెప్పాడు. కాని బ్యాంకిలో డబ్బు దాచుకున్నాడన్నమాట చెప్ప బుద్ధి కాలేదాయనకి.

పార్వతి, జ్యోతి ఇద్దరి ముఖాలూ వాడిపోయాయి.

"నేననుకుంటూనే వున్నాను. . . ఆ మనిషికి మనం కన్పిస్తామా?. . . ఒకసారి తన చిన్ననాటి జీవితాన్ని గుర్తుచేసుకోమనకపోయారూ!"పట్టరాని-వుక్రోషంతో అంది పార్వతి.

పేలవంగా నవ్వాడు రమణారావు!

జ్యోతి అంది: "మీరేం బాధపడకండి, నాన్నా! ఇప్పుడు నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు. . . బియస్సి తరవాత ఉద్యోగం చేస్తాను."

"జ్యోతి!"

[illegible] తలవంచుకునే అంది.

[illegible] తిరిగే ఆలోచనలతో సతమత మయ్యారు.

"నువ్వేవీ పట్టించుకోకు. వెళ్ళి చదువుకో" అని పార్వతి కూతుర్ని ఉద్దేశించి అంది.

రోజురోజుకీ జ్యోతిలో నిర్లిప్తత పెరుకుంటూంది. తల్లి తండ్రి ఎక్కడ బాధపడ్తారో యని నవ్వుతూ మాట్లాడాలని ప్రయత్నిస్తుంది. కాని ఆ నవ్వులో నిండుదనం లేదు. ఏదో వెలితిగా వుంటుంది. ఆ కళ్ళల్లో కాంతి కన్పించదు. చదవాలనే ప్రయత్నిస్తుంది. కాని, చదవలేకపోతూంది.

గుండెల్లో బడబాగ్నితో దహించుకుపోతూ, పైకి మామూలుగా వుండటానికి ప్రయత్నిస్తున్న కూతుర్ని చూసి ఆ తలిదండ్రుల హృదయాలు తల్లడిల్లి పోతున్నాయి.

రమణారావు ప్రతిరోజు అప్పులకోసం తిరగని చోటు లేదు. ఆఫీసునుండి రావటంమొదలు, భోజనాల వేళవరకు ఎక్కడెక్కడికో వెళ్తూనే వున్నాడు. అడగరాని వాళ్ళను అడుగుతూనేవున్నాడు. ఇదివరకు లంచం [illegible] పనిచెయ్యమని అతని చుట్టు తిరిగిన పెద్దమనుషులు 'మాకు సహాయం చెయ్యమంటే, అన్యాయం అన్నావ్! నీకెలా యివ్వం?' అంటూ హేళనగా నవ్వారు.

పాపం, రమణారావు అన్నీ భరించాడు. కానీ పైసా దొరకలేదు.

పదిరోజులు గడిచాయి ఇలా!

ఒకరాత్రి మంచినీళ్ళకని లేచిన రమణారావు జ్యోతి గదిలో లైటు వెలుగుతూండటం గమనించి, ఆశ్చర్యపడి, ఇంకా చదువుతూందా అనుకుంటూ తలుపుసందుగుండా లోపలకు చూశాడు.

క్షణం అప్రతిభుడయ్యాడు.

జ్యోతి టేబిల్‌పైనున్న శ్రీధర్ ఫోటోను చేత్తో పట్టుకొని చూస్తూంది. ఆమె కళ్ళనుండి అశ్రువులు చెక్కిళ్ళమీదుగా జారి, టేబిల్‌పై పడుతున్నాయి.

"మిదాన్ని కాలేను . . . క్షమిస్తారు కదూ! ఉద్యోగం చేస్తాను. నాన్న కష్టం లేకపోతే, నాన్న చూసిన వరుణ్ణి చేసుకోవాలి!. . . మిమ్మల్ని మరచిపోవాలంటుంది లోకం. కాని, అది సాధ్యమా!"

జ్యోతిని పిల్చి ఏదో చెప్పాలనిపించింది. కాని, ఆ స్థితిలో తనను చూశాడని తెలిస్తే జ్యోతి బాధ పడ్తుంది అనుకుని ఆ ప్రయత్నంనుండి విరమించు కున్నాడు. అతని మనసు ఆవేదనతో మెలికలు తిరిగింది.

"ఛీ! నేనూ ఒక మనిషినేనా?" అని భారంగా గొణుక్కుంటూ వెళ్ళి, మంచినీళ్ళ సంగతి మర్చిపోయి, మంచంపై వాలిపోయాడు.

'తమ్ముడూ! నీ అభివృద్ధికోసం నేనంతగా కష్టపడకపోయినట్లయితే, నా జ్యోతి పెళ్ళికి ఇన్ని ఆటంకాలు, బాధలు లేకపోను. నిర్విఘ్నంగా, నిరాటంకంగా దాని పెళ్ళి జరిగివుండేది. నువ్వంత స్థితిలో వుండి, నీ బిడ్డలకి ఇప్పట్నుంచి పోగు చేస్తున్నావ్! నీలో నిసమెత్తు ముందుఆలోచన నాకున్నా, ఎంతో బాగుండేది. ఆ తెలివి నాకు లేకపోయిందిరా!?'

మొట్టమొదటిసారిగా ఆత్మవిశ్వాసం సడలి, జీవనసమరంలో మొదటిసారిగా ఓటమి సంగీకరిస్తూ, నిస్పృహగా నిట్టూర్చాడు, పాపం, రమణారావు!

మర్నాడు జ్యోతి కాలేజీకి వెళ్ళిన తరవాత, సద్దుమకుంటూనే రాత్రి జరిగిందంతా భార్యతో చెప్పాడు రమణారావు. పార్వతి గుడ్లనీరు కుక్కుకుంటూ ఉండిపోయింది.

"ఏడవకు, పార్వతీ! భగవంతుడు మనయందు లేడు . . . ఆఖరు ప్రయత్నంగా ఒకటే చేద్దాం. డబ్బంతా దొరకలేదని, తక్కిన సొమ్ము తరవాత యిస్తానని వేడుకుంటాను . . ."

"వాళ్ళు కాదుకూడదు వివాహానికి ముందే ఇవ్వాలంటే . . ." సందేహంగా చూసింది పార్వతి.

"పార్వతీ! అసలే సగం క్రుంగిపోయాను. పూర్తిగా బలహీనుణ్ణి చెయ్యకు. నా ఆశను త్రుంచివేయకు ..." దీనంగా అన్నాడు.

". . . . . . . . . ."

"వాళ్ళ కాళ్ళు పట్టుకుని వస్తాను, పార్వతీ! జ్యోతికీ విషయం తెలియనివ్వకు." వెళ్ళేముందు, వెంకటేశ్వరునికి దణ్ణం పెట్టుకున్నాడు, పార్వతి శకునం నచ్చింది.

రమణారావును కాస్త దూరంలో చూడగానే, వీధిగుమ్మంలోనున్న పార్వతి మనసు ఆందోళనతో కొట్టుమిట్టాడింది. గుమ్మంలోనున్న భార్యను చూసి చిన్నగా నవ్వాడు రమణారావు. ముడతలుపడిన అతని ముఖంలో ఏదో సాధించాననే తృప్తి కన్పిస్తూంది స్పష్టంగా. ఆత్రత ఆణచుకోలేక గుమ్మంలోనే అడిగింది పార్వతి:

"కాయా? పండా?"

"పండే!" చిన్నగా నవ్వాడు.

పార్వతి ముఖంలో కోటిదీపాలు వెలిగాయి. 'హమ్మయ్య' అనుకుంటూ తృప్తిగా శ్వాసపీల్చి, మగనికి నీళ్ళు అందించింది. రమణారావు కాళ్ళు కడుగుకుని వచ్చేప్పటికి కాఫీగ్లాసుతో ప్రత్యక్షమైంది పార్వతి.

ఆనందరేఖల అలలతో నిండిన భార్య ముఖంలోకి తృప్తిగా చూసి అందుకున్నాడు: "పార్వతీ! . . . దైవం మనయందున్నాడు. అందుకే అడిగీఅడగటంతోనే వాళ్ళు ఒప్పుకున్నారు." జ్యోతి అక్కడకు వచ్చింది.

"ఇదంతా దాని అదృష్టం."

అంతా విన్న జ్యోతి ముఖంలో, తాము కోరుకున్న ఆనందం లేకపోవటం గమనించి, ఆశ్చర్యపోయారు.

"అదికాదు, నాన్నా! అంత మొత్తం తీర్చాలంటే కష్టంకదూ!"

"అందుకని . . ."

"ఈ సంబంధం వద్దులే, నాన్నా!"

"పిచ్చితల్లీ! తప్పు! కన్నీరు కూడదు. మంచివాళ్ళకు దైవసహాయం ఎప్పుడూ వుంటుందమ్మా!" కూతురి కన్నీళ్ళు ఆప్యాయంగా తుడిచాడు.

* * *

పెళ్ళిసరంజామా అంతా సమకూరుస్తున్నాడు రమణారావు. ముహూర్తం పెట్టించి వియ్యంకులికి తెలిపాడు. రమణారావు సంతోషానికి అవధుల్లేవు. అతని మనసు దూదిపింజలా తేలిపోతూంది!

ఏదో పురమాయిస్తూ పందిరివేయిస్తున్న రమణారావు వీథిలో కారు ఆగటం చూసి, ఎవరా అనుకున్నాడు.

కారులోంచి దిగిన సూర్యనాథ్‌ను చూసి ఏదో

భావం అతని ముఖంపై తళుక్కున మెరిసింది.

"ముహూర్తం పెట్టలేదు అన్నయ్యా!" చిన్నగా నవ్వుతూ వచ్చాడు. అతని నవ్వులో ఏదో లోపం కన్పించింది రమణారావుకు.

"ఆఁ! ఆఁ! పెట్టాం మురా! . . . వారంరోజులుంది. నీకు కబురుచేద్దామనుకుంటున్నాను రేపు! రా, లోపలకు." లోపలకు తీసుకువెళ్ళాడు.

హాల్లో కూర్చున్న పార్వతి సూర్యనార్‌ను చూసి మాట్లాడకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

క్షణం తరవాత జ్యోతి కాఫీ తెచ్చియిచ్చింది. కాఫీ అందుకుంటూ "ఏమమ్మా, జ్యోతీ! బాగా చదువుతున్నావా?" అని అడిగాడు సూర్యనార్.

జ్యోతి తల దించుకుంది.

"పెళ్ళికళ్ళ అప్పుడే వచ్చినట్లుందే!" నవ్వుతూ అన్నాడు.

"పిన్ని ఏం చేస్తోంది . . . సుకన్యను వెంకటేశ్వరరావునుకూడా తీసుకురావలసింది."

"వీ పెళ్ళికి ఎలానూ వస్తారుగా."

గ్లాసు తీసుకుని మౌనంగా లోపలకు వెళ్ళింది జ్యోతి. వెళ్తున్న జ్యోతిని చూస్తుండిపోయాడు సూర్యనార్.

"ఆ సంబంధమేరా! . . . తక్కువ కట్నం తరవాత ఇచ్చేలా—" తమ్ముడి ముఖంలో రంగులు మారటం గమనించాలని ప్రయత్నించిన రమణారావు విఫలుడయ్యాడు.

"ఊహూ!" చిన్నగా నవ్వి పూరుకున్నాడు.

పదినిమిషాలయింది. మౌనమే రాజ్యమేలింది.

"వెళ్తానన్నయ్యా!" అంటూ లేచాడు సూర్యనార్.

"భోంచేసి వెళ్ళవచ్చు."

"లేదన్నయ్యా! వెళ్తాను. పనుండి ఇలా వచ్చాను. చూసి వెళ్దాం, కబుర్లు తెలియలేదని ఇలా వచ్చాను" అంటూ లేచాడు సూర్యనార్.

రమణారావు మౌనంగా లేచాడు.

"వదిన ఎక్కడుందన్నయ్యా?"

రమణారావు లోపలకు వెళ్ళి పిల్చాడు. పార్వతి రానంది. సూర్యనార్ తనే 'వదినా' అంటూ పార్వతి ఉన్నచోటుకు వచ్చాడు. అతనిముందే తలుపులు వళాలుమని వేసింది. "మాతో ఏం అవసరం వుండి వచ్చినట్లు! మేం ఇలా బ్రతకటంకూడా ఇష్టంలేదా?"

ఆ మూసుకున్న తలుపులముందు క్షణం నిల్చుండిపోయాడు సూర్యనార్. రమణారావు, జ్యోతి అతన్నే చూస్తుండిపోయారు. సూర్యనార్ నెమ్మదిగా వెనుదిరిగాడు.

"వస్తాను, అన్నయ్యా! వస్తానమ్మా, జ్యోతీ!" జ్యోతికి సూర్యనార్ కళ్ళలో తడి కన్పించింది.

రమణారావుకూడా వీధిలోకి వెళ్ళాడు. "పిల్లలు, మరదలు, నువ్వు నాలుగు రోజుల్లో వచ్చేయండిరా.'

"అలాగే, అన్నయ్యా!" కారు వెనక్కి త్రిప్పాడు సూర్యనార్.

సూర్యనార్ వెళ్ళగానే నిప్పులుగ్రక్కుతూ బయటకు వచ్చింది. "ఏం? ఎందుకు వచ్చాడట? వీళ్ళు జ్యోతిపెళ్ళెలా చేస్తున్నారు, డబ్బెలా దొరకిందనా? లేక కూతురి అభీష్టం తీర్చలేని తల్లితండ్రులం, మనం కుమిలిపోతుంటే చూసి సంతోషించటానికి వచ్చాడా?... అందుకే అదే వుద్దేశ్యం!. . . ఈ చేతుల్లో పెంచాను. . . . రాగానే వదిన గుర్తు రాలేదుకాని, వెళ్ళేముందు మాత్రం గుర్తొచ్చింది! ? . . . "

"అమ్మా!. . . అనుకుంటే ఏం వస్తుంది చెప్పు!"

"పార్వతీ! జరిగిపోయిందేదో జరిగిపోయింది. . ."

"వదినా!. . . కన్నతల్లికంటే మిన్నగా పెంచావు. . నిన్నెలా మరచిపోతాను. . . ఎప్పుడు ఎక్కడ వున్నా నువ్వు గుర్తుంటూవన్న మనిషేగా. . ." వెక్కిళ్ళు అపుకుంటూ అంది పార్వతి. పార్వతిహృదయంలో ఘోష సూర్యనార్, జ్యోతి వివాహానికి డబ్బు సర్దలేదనే బాధకంటే, తనతో ముందుగా మాట్లాడలేదనే ఆవేదనే ఎక్కువ ఉన్నట్లు రమణారావు అర్థం చేసుకున్నాడు.

నెమ్మదిగా ఆలోచించిన రమణారావుకు, భార్య మాటల్లో కొంత నిజం వుందనిపించింది. . . తమ్ముడిరాకలో ఆంతర్యం పెళ్ళి ఎలా చేస్తున్నారో చూద్దామనా? . . . ఆ సంబంధం చెడిపోయి, మేమంతా గుండె పగిలి చస్తుంటే, కుమిలి కుమిలి ఏడుస్తుంటే, చూసి సంతోషించాలని వచ్చాడా? ఎంత క్రూరమైన ఆలోచనరా తమ్ముడూ! . . . నేను పెంచింది మనిషిని కాదని. . . పాలుపోసి క్రూర సర్పాన్ని పెంచానని ఇప్పుడే తెలుస్తోంది. . . మా పైన ఈ పగకు కారణం ఏమిటి? నిన్ను మేం ఇద్దరం పువ్వుల్లో పెట్టి, ఆప్యాయంగా పెంచటమేనా?

తమ్ముడిపై పూర్తిగా, అసహ్యం ఏర్పడింది . . . ఉన్న కాస్త ప్రేమ, ఆదరణ, ఆప్యాయత మటుమాయమయ్యాయి. రమణారావు ఆవేదనతో శూన్యంలోకి చూస్తుండిపోయాడు.

'ఇద్దరం. . . ఒకే తల్లికడుపున, ఒకే రక్తాన్ని పంచుకుపుట్టాము. ఇద్దరిలో ఒకే రక్తం ప్రవహిస్తోంది కాని. . . కాని. . . ఇద్దరికీ ఎంత తేడా?'

● ● ●


జ్యోతి వివాహానికి సూర్యనార్, విమల, పిల్లలు వచ్చారు. రమణారావు తనలో మెదిలే భావాలు పైకి కన్పించనీయకతెచ్చిపెట్టుకున్న నవ్వుతోనే సంచరించాడు. విమల జ్యోతికి రెండు వందల రూపాయల చీర పెట్టింది. సూర్యనాధ్ వట్టిచేతులతో వుండిపోయాడు, జ్యోతిమనను చివుక్కుమంది.

'తనేమి కోరదు. కనీసం రెండు గాజు గాజులైనా, రూపాయి పెట్టి కంకుమ భరిణైనా చాలు ప్రేమతో బాబాయి యిస్తే, విప్పి ఇచ్చిన చీరకంటే ఎంతో ఆప్యాయంగా స్వీకరించేది. చిన్నాన్న మారిపోయాడు!' జ్యోతికేదో వెలితిగా, తీరని లోటుగా అనిపించింది.

సూర్యనాధ్ ఏమి తెలియని వాడిలా, నవ్వుతూ అన్ని పనులు చూస్తుంటే, రమణారావు 'నువ్వెంతకయినా తగుదువురా, తమ్ముడూ! . . . లోలోపల ఈ పెళ్ళి చెడిపోవాలని వున్నా, ఎలా నవ్వుతూ నంగనాచిలా ప్రవర్తిస్తున్నావు' అనుకున్నాడు.

రెండవ రోజున సూర్యనార్, విమలలు బయలుదేరారు. పిల్లల్ని తరవాత పంపుతానంది పార్వతి. స్కూలు పోతుందంది విమల. సూర్యనాధ్ ఏమీ అనలేదు. పార్వతి విమలకు మరో 200 రూ.

## "లకోటా" ప్రశ్నలు —లాంగ్టన్



చీర పెట్టింది. విమల తెల్లబోయింది. ఇదేమంటే "వట్టిచేతులతో పంపుతామా!" నవ్వుతూ అంది పార్వతి.

మార్వాడీ, పార్వతివేపు చూశాడు.

మార్వాడీకుటుంబం వెళ్ళాక, ఏదో వెలితిగా వున్నట్లు అనిపించింది అందరికీ.

• • •

జ్యోతివివాహమై రెండు నెలలయింది.

నెల క్రితం మార్వాడీ రెండుసార్లు వచ్చాడు. జ్యోతినీ, శ్రీధర్‌నూ తనతో పంపితే పది రోజులుండి వస్తారని అడిగాడు. . . "మా కింకా సరదా తీరలేదు, పంపిస్తాలే" అన్నాడు నవ్వుతూ రమణారావు. పార్వతికి అసలు పంపించాలనే లేదు. శ్రీధర్, ఒకసారి దారిలో కన్పించాడు.

మళ్ళీ ఉత్తరం వ్రాశాడు రెండు రోజుల క్రితం మార్వాడీ [illegible] తమ్ముడేది ఉత్తరం వ్రాస్తే కారు తీసుకువస్తానంటూ. రమణారావు పంపిద్దామా అని అడిగాడు . . . పార్వతి ససేమిరా ఒప్పుకోలేదు. మరో నెల చూద్దాం అంటూ కార్డువ్రాసి పడేశాడు.

శ్రీధర్, జ్యోతుల అన్యోన్యత, నవ్వులు, పరిహాసాలు జ్యోతిముఖంలో కళ, ఆనందం చూస్తుంటే ఆ దంపతుల సంతోషానికి అవధులు లేవు.

తక్కిన కట్నంసొమ్ము వాళ్ళడగకుండానే ముట్ట చెప్పాలనే రమణారావుకు ఆత్రుతగా వుంది. ఏమి పాలు పోవటంలేదు. జ్యోతిసంసారం విచ్ఛిన్నమౌతుం దేమోనన్న బెంగ ఆయన్ని మరీ క్రుంగదీస్తోంది.

ఒకనాడు —

జ్యోతి తల్లిదగ్గర వంటగదిలో వుండటం గమనించి రమణారావు నెమ్మదిగా శ్రీధర్‌వున్న గదిలోకి వెళ్ళాడు. మామగారిని చూసి, శ్రీధర్ చదువుతున్న నవల ప్రక్కన వుంచి "రండి, మామయ్యగారు!" అంటూ లేచి కూర్చున్నాడు.

"ఆఁ! . . .ఆఁ! . . . పర్వాలేదులెండి మీరు కూర్చోండి" అంటూ, అక్కడున్న కుర్చీలో చతికిల పడ్డాడు. రావటమంటే తేలిగ్గానే వచ్చాడు కాని, ఎలా మొదలుపెట్టాలో అర్థంకాక, తికమక పడ్డాడాయన.

అంతలో జ్యోతి టిఫిన్ప్లేటు, మంచినీళ్ళు తీసుకువచ్చింది. వెనకనే పార్వతి ఫ్లాస్క్ తెచ్చి గుమ్మం ప్రక్కనుంచి, లోన భర్త ఉండటం గమనించి ఆగింది.

రమణారావు ఏదో తటపటాయించటం గమనించి, శ్రీధర్ అడిగాడు —.

"ఏమిటండీ, మామయ్యగారూ!" గుమ్మంలో నున్న జ్యోతిని చూస్తూ.

రమణారావు జ్యోతిని చూడలేదు. "అహా! ఏమి లేదండి. . . మీకు రావలసిన కట్నంసొమ్ము. . . త్వరలోనే అందజేస్తామని నాన్నగారితో చెప్పండి." ఎలా పట్టాలో తెలియక అనేశాడు.

శ్రీధర్ తెల్లబోయి చూశాడు. "ఏమిటి మీరంటున్నది?"


"కట్నంసొమ్ము పూర్తిగా లేదంటే, అంతా ఒకే పర్యాయం ఇవ్వమన్నారు . . ."

"మా కెప్పుడో ముట్టిందికదండీ!"

జ్యోతి, పార్వతి, రమణారావు విభ్రాంతులయ్యారు.

". . . మీకు. . మీకివ్వందే. . ఎలా ముట్టింది?" తడబడ్డాడు.

"మీ తమ్ముడుగారు, మార్వాడీగారు ఎప్పుడో



వాస్తువిన్యాసం

ఫోటో—కె. రాజారామరావు (మద్రాసు–33)

ఇచ్చేశారే."

ముగ్గురూ స్తంభించిపోయారు. ముగ్గురికీ గుండెలు క్షణం ఆగి, తిరిగి కొట్టుకోసాగాయి.

రమణారావు తల కదిలిస్తూ: "ఏ. . . మి. . టి. .? మీరంటున్నది! . . . నిజమా! . . . వాడెప్పుడిచ్చాడు? మాకు తెలియదే!" అంటూ అనుమానంగా చూశాడు.

"మార్వాడీగారు మా అన్నయ్య ఫ్రండండి! రెండేళ్ళక్రితమే మీ అమ్మాయిని నాకు చేసుకోవాలని గట్టిగా పట్టుబట్టారండి. మీ అమ్మాయి, జ్యోతి పేరున పది వేలు బ్యాంకి ఎకౌంట్ చూపించారు."

ముగ్గురూ నిర్జీవప్రతిమల్లా నిల్చుండిపోయారు చేష్టలుడిగి! రమణారావు ముఖంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు. పార్వతి సంగతి చెప్పక్కర్లేదు. శ్రీధర్‌చెప్పే ఒక్కోమాట ఒక్కో శూలంలా తగిలాయి.

పశ్చాత్తాపం దహించి వేస్తోంది. వారి కళ్ళ ముందు ఏవేవో సంఘటనలు నెమ్మదిగా కదుల్తూ వెళ్ళాయి.

జ్యోతి, శ్రీధర్‌చేతిని గట్టిగా పట్టుకుని, "మీరు మీరు చెప్పింది నిజమా?" అని ఆవేదనగా అడిగింది.

"మీకు తెలియదా? ఆశ్చర్యంగావుందే. . . పోనీ ఈ విషయం తెల్సా?"

"ఏ విషయం?" నీరసంగా అడిగారు జ్యోతి, రమణారావు.

పార్వతిహృదయం దడదడలాడుతోంది. ప్రాణాలుగ్గ పట్టి, శ్రీధర్ చెప్పబోయేది వినడానికి సిద్ధంగా వుంది.

"జ్యోతి కాలేజిలో ఎలా చదువుతోంది? జ్యోతికి స్కాలర్‌షిప్ ఎలా వస్తోందనుకుంటున్నారు? ప్రిన్సిపాల్ ద్వారా, అన్నీ ఆయన యిస్తున్నారు."

జ్యోతి స్థాణువైపోయింది.

"పోనీ ఈ ఇంటివిషయం తెల్సా?"

"ఏమిటి?" విస్మయంగా చూస్తూ అడిగాడు రమణారావు.

"ఈ ఇంటికి మీరు పదిహేను రూపాయలు అద్దె ఇస్తున్నారు. తక్కిన ముప్పైఐదు రూపాయలు ఆయనే చెల్లిస్తున్నారు. మీకు కావలసినవి కోటా సరిగా యివ్వమని, తహసీల్దారుగారితో చెప్పారట. ఇవేమి మీకు తెలియవా? ఆయన ఎందుకింత గుప్తంగా దాచారో" అంటూ శ్రీధర్ విచిత్రంగా చూశాడు.

రమణారావు అచేతనుడయ్యాడు. ఆయనకళ్ళనుండి అశ్రువులు ఏకధారగా కారుతున్నాయి. అతని మెదడంతా శూన్యమైపోతుంది.

"నిజమా!. . . కాదు. . నిజంకాదు!. . . నిజమే! తమ్ముడూ! నిన్ను గురించి ఎంత హీనంగా ఊహించానురా? . . . భగవంతుడు నన్ను క్షమిస్తాడా? . . . ."

ఆయన మాటలు పూర్తికాకుండానే, ఆయన స్పృహతప్పి పడిపోయాడు. జ్యోతి, శ్రీధర్‌లు కలసి ఆయన్ని మంచంపై పడుకోబెట్టారు.

పార్వతి నిల్చున్నచోటనే కూలబడిపోయి, మోకాళ్ళలో తలదూర్చి వెక్కివెక్కి ఏడువసాగింది.

జ్యోతికళ్ళనుండి రెండే రెండు అశ్రుకణాలు జారి పడ్డాయి.

రమణారావుకు గంటకు స్పృహవచ్చింది. ఇరుపక్కల వున్న అల్లుణ్ణీ కూతుర్నీ జీవంలేనట్లు చూస్తున్నాడు. గంట క్రితం ఎంతో దృఢంగావున్న అతనికి, ఇప్పటి మనిషికి పోలికల్లేనట్టున్నది.

"బాబూ! వాడికి టెలిగ్రాం యివ్వండి . . . నేనెంతోకాలం బ్రతకను. . ." కన్నీళ్ళతో అన్నాడు.

"నాన్నా!"

"అలా బెంబేలు పడకండి. . . విశ్రాంతి తీసుకోండి." అని శ్రీనాథ్ వెళ్ళాడు.

శ్రీనాథ్ కాలేజికి వెళ్ళాక, పార్వతి, రమణారావున్న మంచంపై ప్రక్కగా కూర్చుని గుడ్లనీరు కుక్కుకుంటోంది. "ఛ! ఏడవకు పార్వతీ!. . . వాడి మనసులో ఏముందో ఎవరికి తెలియదు. . . మనం తొందరపడ్డాం" అన్నాడు.

* * *

శ్రీనాథ్ టెలిగ్రాం అందుకుని పురకలు పరుగులు మీద, మర్నాడు వచ్చేశాడు సూర్యనాథ్.

శ్రీనాథ్ అప్పటికే కాలేజికి వెళ్ళాడు.

బయట కారు శబ్దం వినగానే, రమణారావు లేచి గంభీరతను తెచ్చుకోటానికి యత్నిస్తున్నాడు.

"అన్నయ్యా!" అంటూ సూర్యనాథ్ లోపలకు వచ్చి, "ఎలావుందన్నయ్యా!" అని రమణారావు ప్రక్కనే మంచంపై కూర్చుని ఆతృతగా అతని ఒంటిపై చెయ్యివేశాడు.

"నా చావు చూడాలని వుందికదరా నీకు?"

"అన్నయ్యా!" ఆవేదనగా అన్నాడు సూర్యనాథం.

"లేకపోతే నువ్వు చేసిందేమిటి?"

"నేనా?. . . నేనేం చేశాను?" కంగారుగా,

"డబ్బు గుప్తంగా యివ్వటంలో నీ ఆంతర్యం?" మాట పూర్తికాకుండానే నవ్వేశాడు సూర్యనాథ్. "ఓహో! అదా . . . అంతేనా? టెలిగ్రాం చూసి అదిరిపోయాను."

"నవ్వు. . . నవ్వరా! నీకు నేను వెధవనేగా. . ." కంఠం బొంగురుపోయింది. సూర్యనాథ్ ప్రక్కనే వెక్కిళ్ళు మిన్నించి తలెత్తాడు. . . జ్యోతి!. . . లేచి వెళ్ళి జ్యోతిచుట్టూ చెయ్యివేసి, కళ్ళు తుడుస్తూ "జ్యోతీ! ఏమిటిది? మీకందరికి పిచ్చిపట్టిందా? ఎందుకీ కన్నీళ్ళు!" అని అడిగాడు.

"క్షమించు చిన్నాన్నా! నువ్వు సహాయం చెయ్యకుంటే . . ."

"పిచ్చిపిల్లా!" అని జ్యోతి నుదుట ముద్దు పెట్టుకుని, అమ్మ ఎక్కడంటూ లోపలకు నడిచాడు.

"ఛ! వదినా . . . ఏమిటిది? . . . ఇలా చూడు నీ కొడుకు వచ్చాడు" అంటూ పార్వతిముఖం తనకేసి త్రిప్పుకొన్నాడు. "మమ్మల్ని క్షమించు సూర్యా!" అంటూ సూర్యనాథ్ చేతుల్లో ముఖం దాచుకుంది! సూర్యనాథ్ నవ్వేశాడు. "ఇదింకా బాగుందమ్మా. బిడ్డ తల్లిని క్షమించమనటం విన్నాం కాని, తల్లి బిడ్డను క్షమించమనటం వినలేదు!" పార్వతిని హాల్లోకి నడిపించుకొని వచ్చాడు. జ్యోతి దగ్గరకు వెళ్ళి దగ్గరకు తీసుకుని, పార్వతి రమణారావులను చూపిస్తూ "వాళ్ళిద్దరూ నీకు కాదమ్మా, మనిద్దరికి తల్లిదండ్రులు" అన్నాడు.

రమణారావు అడిగాడు: "ఎందుకంత గుప్తంగా ఉంచావు? మమ్మల్ని పరీక్ష చెయ్యటానికా?"

"నాకా ఉద్దేశ్యం లేదు . . . ఎంతో మమతతో పెంచినా కోపం రావటంలో అసహజం ఏమీలేదు. మనం ఏకోదరులం. మనిద్దరికి ఒక్కటే భేదా! నీకు సహృదయురాలైన వదిన దొరకటంతో, నా కోసం నువ్వేమిచేసినా, అడ్డగించలేదు సరికదా మీదు మిక్కిలి సహాయపడింది. మీరు ఇద్దరూ కలిసి నాకోసం శ్రమ పడ్డారు. నీకు వదిన సానుభూతి, సహకారం ఉన్నాయి. కాని, నాకు విమల దొరికింది. ఇతరులకు చెయ్యి విదల్చాలంటే. . . ఆవిడకిష్టం వుండదు. అంతే అందుకే. . ."

"నువ్వు గొప్పఇంటిపిల్ల వద్దంటే వినే వినలేదు. నువ్వు, నీ పిల్లలు సుఖపడతారనే ఉద్దేశ్యంతో చేశాను."

"విమల పెరిగిన వాతావరణం అటువంటిదన్నయ్యా. కాని, ఎలావున్నా, కొంతవరకు అదృష్టవంతుణ్ణే! . . . విమల నేనంటే ప్రాణం యిస్తుంది."

"సరిలే. అంతే చాలు.

"ముత్యానికి నీ మాట చెల్లించుకున్నావురా!"

"ఏమిటి?"

"జ్యోతి వివాహం, నీ చేతుల్లో చేస్తానవేవాడివే, గుర్తుందా!"

సూర్యనాథ్ నవ్వుతూ జ్యోతివేపు ఆప్యాయంగా చూశాడు.

"ఏమిటోరా? నువ్వు డబ్బు లేదనగానే అలా అయిపోయాం! . . ." అన్నాడు పశ్చాత్తాపంగా.

"తప్పు లేదన్నయ్యా! మొక్క నాటిన తరవాత ఏ వ్యక్తైనా ఫలితాన్నిస్తారు."

క్షణం తరవాత, రమణారావు సందేహంగా చూడటంతో, సూర్యనాథ్ అన్నాడు. "ఏమిటన్నయ్యా!"

"అహహ! . . . ఏమి లేదురా! . . . ఈ డబ్బు యితర్రా. . ." అనుమానంగా చూశాడు రమణారావు.

అదిరిపడ్డాడు సూర్యనాథ్ "అన్నయ్యా! ఏమిటి నువ్వనేది!. . . నన్ను . . . నన్ననుమానిస్తున్నావా?"

"అదికాదురా!"

"ఈ శరీరంలో నీలో ప్రవహించే రక్తం ప్రవహిస్తోంది, అన్నయ్యా! ఈ శరీరం నువ్వు పెంచింది . . . కాని, ఒక్క విషయం మర్చిపోవద్దన్నయ్యా! నువ్వు శిల్పివి. నేను నువ్వు నీ భావాలతో, ఆశయాలతో అనుగుణంగా మలచబడిన శిల్పాన్ని. నాలో, నీలో మెదిలే ఆశయాలే మెదులుతున్నాయ్. నన్ను నమ్ము!" బాధగా అన్నాడు.

"కాదురా . . . కాదు . . ." తల విదిలించాడు.

"అన్నయ్యా! నీకు నమ్మకం . . ."

"అదికాదురా! . . . నువ్వు నాకంటే ఎన్నోరెట్లు . . . ప్చ్! . . . నేను ఫలితాన్నాశించాను . . . నువ్వు గుప్తంగా కనీసం ఎవరికీ తెలియకుండా చేశావు . . . నీ హృదయం . . . ప్చ్! . . . నువ్వు నాచే మలచబడిన శిల్పానివికాదు . . . నీలో నాలో వున్న బలహీనతలు లేవు . . . వున్నత శిల్పానివి."

శ్రీనాథ్ లోపలకువస్తూ అన్నాడు:

"రచయితైనా, శిల్పియైనా తనలో లేని వున్నతను తమ శిల్పంలో, తమ రచనలలో పొందుపర్చాలని ప్రయత్నిస్తారు... పొందుపరుస్తారు. అలాగే, శిల్పికూడా తన శిల్పాన్ని, ఎన్నో తనలోనేని ఔన్నత్యాలను పోసి చెక్కి చూపిస్తాడు."

అందరి మనసులు తేలికగా వున్నాయి.


"ఈ రోజుకోసం ఎంతగా ఎదురుచూశానో!" రమణారావు కళ్ళు తుడుచుకున్నాడు.

"జ్యోతి పండంటిపాపాయినిస్తే . . ." సూర్యనాథ్ అన్నాడు.

శ్రీనాథ్ చిలిపిగా చూశాడు. జ్యోతి వెక్కిరించింది. ముగ్గురు నవ్వేశారిది చూసి.

రమణారావు మనసు ఆనందంతో పరవళ్ళు త్రొక్కుతూంది.

రమణారావు మనసులో దిగులు లేదు! ★



ఏకాంతం ఫోటో—ముప్పనసోమరాజు (పెద్దాపురం)